28032024-DIS-04_Layout 1 3/28/2024 2:18 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

హామీలకు ఎగనామం

'వెనుకాముందూ చూసుకోకుండా హామీ ఇచ్చేయడం, తర్వాత వల్లకాదని చేతులెత్తేయడం కాంగ్రెస్ తత్వం' అని చెప్పుకోవాలేమో. లంకె బిందెలు ఉంటాయనుకుంటే ఖాళీ భోషాణం స్వాగతం పలికిందని పరిణతి లేని మాటలతో పరిపాలన మొదలుపెట్టారు పాలకులు. కొత్త ప్రభుత్వం గద్దెనెక్కి నాలుగు నెలలు కావస్తున్నది. హామీల అమలుపై పూటకోమాట చెప్పి తప్పించుకోవడం కాంగ్రెస్ నేతలకు పరిపాటిగా మారింది. తాజాగా రైతు రుణమాఫీపై మాటతప్పే సూచనలు కనిపిస్తున్నాయి. 'హామీ ఇచ్చిన మాట వాస్తవమే కానీ, రాష్ట్ర పరిస్థితి ఇలా ఉంటుందని అనుకోలేదు' అనే మాటలు సర్కారు వైపు నుంచి వినిపిస్తుండటమే అందుకు కారణం. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దల పరిపాలనా అవగాహనను, సామర్థ్యాన్ని ప్రశ్నార్థకం చేస్తున్నదని చెప్పక తప్పదు. రుణభారాన్ని సాకుగా చూపి రైతు రుణమాఫీపై మొండిచెయ్యి చూపాలన్న ఆలోచన సర్కారు చేస్తున్నట్టు సందేహాలు కలుగుతున్నాయి. పార్లమెంటు ఎన్నికలకు ముందు అలా చేయడం కుదరదు గనుక ఫలితాలు వెలువడిన తర్వాత చావుకబురు చల్లగా చెప్తారేమో.

రూ.2 లక్షల వరకు పంటరుణాలు మాఫీ చేస్తామని గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆ దిశగా ఇంతవరకు ఎలాంటి ముందడుగు పడలేదు. మరోవైపు బకాయిల వసూలు కోసం బ్యాంకర్లు రైతులను వేధింపులకు గురిచేస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. రైతుబంధు అందక పెట్టుబడి సాయం కోసం తంటాలు పడుతూ, సాగునీరు లేక పంటలెండుతూ సతమతమవుతున్న రైతులకు ఇది పిడుగుపాటే అవుతుందనడంలో సందేహం లేదు. రైతుబంధు పెంచడం మాటేమో గానీ, ఇదివరకు ఇస్తూ వచ్చింది కూడా ఆలస్యమవుతున్నది. కొద్దిమందికి ఇచ్చి చేతులెత్తేశారు. రైతుబంధు సొమ్ము జీతాలకిచ్చేశామని పాలకులు చెప్పారు. నిరుద్యోగ భృతి విషయంలో నాలుక మడతేశారు. అసలా హామీ ఇవ్వనేలేదని అంటున్నారు. ఉచితాల విషయంలో తెల్లరేషన్ కార్డు లంకె పెట్టడంతో చాలామంది లబ్ధిని నోచుకోలేకపోయారు.

అధికారం దక్కుతుందో లేదోననే ఆతృతలో 420కి పైగా హామీలను కాంగ్రెస్ పార్టీ ప్రజల మీదకు వదిలింది. ఉచితాల పేరుచెప్పి ఊదరగొట్టింది. కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చినదానికన్నా అదనంగా ఇంకేదో దక్కుతుందని ప్రజలు కూడా కొంతవరకు నమ్మారు. ఫలితం తెలిసిందే. అధికారం దక్కించుకున్న తర్వాత వాటిని అమలు చేయలేక కుంటిసాకులతో తప్పించుకోవాలని హస్తం సర్కార్ చూస్తున్నది. హామీలను తూచ్ అంటుండటంతో నమ్మి ఓటేసిన ప్రజల పరిస్థితి అయోమయంగా తయారైంది. వ్యక్తిగతంగా మాట ఇచ్చి తప్పడం అనేది మామూలుగానే జరుగుతుంది. అలా జరిగినప్పుడు 'పాపం వీలు కాలేదోమో'నని సరిపెట్టుకుంటారు. కానీ, ప్రజాపాలనకు సంబంధించిన వ్యవహారంలో అది అభాసుపాలు చేస్తుంది. హామీలు ఇస్తున్నప్పుడు రాష్ట్ర ఆర్థికస్థితి ఏమిటో కాంగ్రెస్ నేతలకు తెలియదా? అదేమన్నా చిదంబర రహస్యమా? రాష్ట్ర ఆదాయవ్యయాలు బడ్జెట్ రూపంలో అసెంబ్లీకి సమర్పించకుండా ఏ సర్కారు అయినా తన ఇష్టారాజ్యంగా ఖర్చు చేస్తుందా? ఆపై ప్రభుత్వ వ్యయంపై కాగ్ విశ్లేషణ కూడా అందరికీ ఉంటుంది. గత అసెంబ్లీలో కాంగ్రెస్ సభ్యులే లేరా? వారు ఆర్థిక చర్చల్లో పాల్గొనలేదా? ఎన్నికలకు ముందే అప్పుల గురించి నానాయాగీ చేసిన కాంగ్రెస్ ఆర్థిక పరిస్థితి తెలిసే అన్ని హామీలు ఎందుకు గుప్పించింది? ఇప్పుడు మళ్లీ అవే అప్పులను చూపించి హామీలను అటకెక్కించాలని చూడటం ఏమాత్రం సమర్థనీయం కాదు. ఇప్పటికైనా సాకులు వెదకడం, అమాయకత్వం నటించడం మానేసి హామీలను చిత్తశుద్ధితో అమలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తే బాగుంటుంది.

ఒకనాడు తెలంగాణది అరవై ఏండ్ల గోస. నీళ్లు, నిధులు, నియామకాల కోసం సుదీర్ఘమైన పోరు సలిపిన చరిత్ర తెలంగాణది. చెరువులు, నీటి వనరుల విధ్వంసం, ప్రాజెక్టుల పెండింగ్.. వెరసి నాడు కంటతడి పెట్టని తెలంగాణ బిడ్డ లేడు. ఇవన్నీ చూసి చలించిపోయిన కేసీఆర్ ప్రత్యేక రాష్ట్రం కోసం అలుపెరగని పోరాటం చేశారు. పద్నాలుగేండ్లలో ఆయన అనేక రూపాల్లో ఉద్యమాలు చేశారు. సభలు, సమావేశాలు, నిరాహార దీక్షలు, ఆమరణ దీక్ష, సకలజనుల సమ్మె, సడక్ బంద్, వంటావార్పు, మానవహారాలు, సాగర హారం, మిలియన్ మార్చ్, జంతర్‌మంతర్ వద్ద ధర్నా, అఖిలపక్ష సమావేశాలు, పార్లమెంటులో అందోళనలు, నిరసనలు చేసి తెలంగాణ ప్రజల కలను సాకారం చేశారు కేసీఆర్.

ఈ క్రమంలో తెలంగాణకు దివిటీగా మారారాయన. అనేక త్యాగాలు, పోరాటాల ద్వారా సాధించిన తెలంగాణను పునర్నిర్మించే గురుతర బాధ్యతను ప్రజలు ఉద్యమ నాయకుడికే అప్పగించారు. ఉమ్మడి పాలనలో ఆగమైన తెలంగాణ పునర్నిర్మాణంలో కేసీఆర్ కార్యోన్ముఖుడయ్యారు. అందుకోసం దేశంలో ఎక్కడా లేని విధంగా అద్భుతమైన పథకాలను రూపకల్పన చేసి, వందకు వంద శాతం అమలు చేశారు. తెలంగాణను దేశానికే రోల్‌మాడల్‌గా తీర్చిదిద్దారు.

బీఆర్ఎస్ గెలుపే తెలంగాణకు రక్ష

రాగిడి లక్ష్మారెడ్డి
80087 24545

తెలంగాణ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కేసీఆర్ సర్కార్ పాలన సాగింది. ఆగమైన తెలంగాణను బాగు చేయడాన్ని ఓ యజ్ఞంగా ఆయన భావించారు. సుపరిపాలనలో భాగంగా రైతుబంధు, రైతు బీమా, 24 గంటల ఉచిత విద్యుత్తు, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, దళిత బంధు వంటి దేశ చరిత్రలో నిలిచిపోయే ఎన్నో పథకాలను తీసుకొచ్చారు. బీఆర్ఎస్ సర్కార్ అమలు చేసిన ఆసరా పింఛన్లు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, కేసీఆర్ కిట్, ఆరోగ్యలక్ష్మి, హరితహారం, డబుల్ బెడ్రూం ఇండ్లు లాంటి అనేక పథకాలు ప్రజల హృదయాల్లో పదిలంగా నిలిచిపోయాయి. తెలంగాణ పథకాలను చూసి దేశం గర్వించడమే గాక అనేక రాష్ట్రాలు మన పథకాలపై అధ్యయనం చేసి, వాటిని అమలు చేస్తున్నాయి. ఒకప్పుడు పశ్చిమబెంగాల్ ఆచరణను దేశం అనుకరించేది. కానీ, బీఆర్ఎస్ హయాంలో మాత్రం యావత్తు దేశం తెలంగాణ వైపు చూసింది. దేశం అబ్బురపడేలా అద్భుతమైన పథకాలను తీసుకురావడం కేసీఆర్‌కే సాధ్యమైంది. కేసీఆర్ పాలించిన పదేండ్లు దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయనడంలో ఎటువంటి సందేహం లేదు.

మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని.. విద్యతోనే అందరికీ సమాన హక్కులు సాధ్యమవుతాయని భావించిన కేసీఆర్ విద్యావ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చారు. దేశంలోఎక్కడా లేని విధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల కోసం వందల సంఖ్యలో గురుకులాలను ఏర్పాటు చేశారు. గురుకులాలతో పాటు ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే సంకల్పంతో సన్నబియ్యం భోజనాన్ని పెట్టారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించాలనే ఉద్దేశంతో ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకాన్ని తీసుకువచ్చారు. ఈ పథకం ద్వారా విదేశాల్లో చదువుకునే ఆయా వర్గాల విద్యార్థులకు రూ.20 లక్షలు సాయం చేసి వారి బతుకులను తీర్చిదిద్దారు.

విద్యా రంగంతో పాటు వైద్య రంగం కూడా వృద్ధి చెందితేనే సమాజం ఆరోగ్యంగా ఉంటుందనేది కేసీఆర్ అభిప్రాయం. ఆ అభిప్రాయంతోనే సర్కార్ దవాఖానల్లో ప్రసూతి సౌకర్యాలను మెరుగుపరిచారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉండాలని కేసీఆర్ కిట్ పథకానికి శ్రీకారం చుట్టారు. ఆడబిడ్డ పెండ్లి చేసేందుకు ఎవరూ ఇబ్బందులు పడకూడదని కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను అమలు చేశారు. వీటి ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఉన్నత సామాజికవర్గంలోని వేల పేద కుటుంబాలు లబ్ధి పొందాయి. వ్యవసాయం, విద్యుత్తు, వైద్యం, విద్య, సంక్షేమ రంగాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు, మార్పులు రాష్ట్రాభివృద్ధికి దోహదం చేశాయి. కేసీఆర్ సర్కార్ చేసిన అభివృద్ధి చరిత్ర పుటల్లోకెక్కడం ఖాయం.

భూత, వర్తమాన, భవిష్యత్తు కాలాలు కలిస్తేనే చరిత్ర అవుతుంది. చరిత్ర సక్రమంగా, న్యాయంగా లేదంటే ఈ మూడు కాలాల్లో ఏదో ఒక దాంట్లో తప్పిదం జరిగినట్టే. చరిత్ర నిర్మాణం ప్రజల కోసమే జరగాలి. ఆ చరిత్ర నిర్మాణంలో ప్రజలు భాగస్వాములు కావాలి. అభివృద్ధి చెందాలి. మన దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించాక అనేక నగరాలు మహానగరాలుగా అభివృద్ధి చెందాయి. ఆ నగరాల గత వైభవాలే ప్రస్తుత అభివృద్ధికి దోహదపడ్డాయి. అలాంటి నగరాల జాబితాలో చారిత్రకంగా, సాంస్కృతికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ముందున్న నగరం మన హైదరాబాద్. దేశంలో అభివృద్ధికి సూచకంగా ఢిల్లీని చూపాల్సిన గత పాలకులు అహ్మదాబాద్, ముంబయి, బెంగళూరు వంటి నగరాలను వాళ్ల రాజకీయ లబ్ధి కోసం ప్రమోట్ చేసుకున్నారు. ఇక లోతుగా విశ్లేషిస్తే.. ఏ రాష్ట్రంలో తమ పార్టీ అధికారంలో ఉంటే ఆ రాష్ట్రానికే అధికంగా నిధులను కేటాయించే మోసపూరిత విధానానికి కాంగ్రెస్, బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయి. అదే విధానాన్ని ఇప్పటికీ అమలు చేస్తున్నాయి. అన్ని రాష్ట్రాలు, నగరాలను సమానంగా చూడకపోగా, వివక్ష పూరితంగా వ్యవహరిస్తున్నాయి. కేంద్రం నిధులు ఇవ్వనప్పటికీ కేటీఆర్ నాయకత్వంలో హైదరాబాద్ విశ్వనగరంగా ఎదిగింది. అంతర్జాతీయ పెట్టుబడులకు వేదికగా మారింది. అటువంటి నగర అభివృద్ధి.. కాంగ్రెస్ హయాంలో అంధకారంలో చిక్కుకునే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నది.

అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఎప్పటిలాగే ప్రజా వ్యతిరేక పాలనను కొనసాగిస్తున్నది. ఆరు గ్యారెంటీలు (మొత్తం 13 గ్యారెంటీలు), 420 హామీలు ఇచ్చి అధికార పీఠమెక్కిన హస్తం పార్టీ ఇప్పటివరకు ఏ ఒక్క హామీని కూడా సంపూర్ణంగా అమలు చేయలేదు. అధికారం చేపట్టిన వంద రోజుల్లోనే అన్నీ హామీలు అమలు చేస్తామని సభల్లో ప్రకటనలు చేసిన కాంగ్రెస్ నేతలు నేడు వాటన్నింటిని గాలికొదిలేశారు. రైతులు, మహిళలు, ఉద్యోగులు, నిరుద్యోగులు, యువతను కాంగ్రెస్ సర్కార్ మోసం చేసిందనడానికి ఈ వంద రోజుల పాలనే నిదర్శనం.

ఇక బీజేపీ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఆ పార్టీ మొదటి నుంచి తెలంగాణకు వ్యతిరేకమే. పదేండ్లు కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ సర్కార్ తెలంగాణకు తీవ్రంగా అన్యాయం చేసింది. నిధుల కేటాయింపు, రాష్ట్ర హక్కుల విషయంలో విపరీతమైన వివక్షను చూపింది. తెలంగాణలోని నలుగురు బీజేపీ ఎంపీలు రాష్ట్రానికి రావాల్సిన నిధులు, హక్కులపై ఒక్కసారి కూడా మాట్లాడలేదు, పోట్లాడలేదు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఎప్పటికీ తెలంగాణకు ద్రోహమే తలపెడతాయి. తెలంగాణ అభివృద్ధి జరగాలన్నా, కేంద్ర నిధుల కేటాయింపులు జరగాలన్నా, మన హక్కులను రక్షించాలన్నా పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలవాల్సిందే. తెలంగాణ సస్యశ్యామలంగా ఉండాలంటే.. తెలంగాణలోని 17 పార్లమెంట్ స్థానాల్లోనూ బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలి. తెలంగాణ అస్తిత్వానికి ప్రతీక అయిన బీఆర్ఎస్ జయభేరి మోగిస్తేనే.. మన నీళ్లు, నిధులు, నియామకాలు మనకు దక్కుతాయి. బీఆర్ఎస్ గెలుపే తెలంగాణకు రక్ష. తెలంగాణ సుభిక్షంగా ఉండాలంటే కేసీఆర్, కేటీఆర్‌ల నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీ సార్వత్రిక ఎన్నికల్లో విజయధంకా మోగించాలి.

(వ్యాసకర్త: మల్కాజిగిరి నియోజకవర్గ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి)

లేఖలు

టెట్ లేకుండానే పదోన్నతులివ్వాలి

ఎన్నో ఏండ్లుగా ఇన్విజిలేటర్, స్పాట్ వాల్యుయేషన్ డ్యూటీలు చేస్తున్న ప్రభుత్వ, పంచాయతీరాజ్ పాఠశాలల ఉపాధ్యాయులు టెట్ ఉత్తీర్ణత కావాలనడం అర్థరహితం. నిబంధనల పేరిట కాలయాపన చేయడం తగదు. అదీకాకుండా జీవశాస్త్రం బోధించే టీచర్లను భౌతికశాస్త్రం, భాషోపాధ్యాయులను సాంఘిక శాస్త్రం సంబంధించి టెట్ రాయాలనడం విచిత్రం. ఎలాంటి అర్హత పరీక్ష లేకుండానే కాంట్రాక్టు లెక్చరర్లను ఇంటర్, డిగ్రీ ఉపన్యాసకులుగా నియమిస్తూ.. ఉపాధ్యాయులు మాత్రం టెట్ ఉత్తీర్ణత సాధిస్తేనే పదోన్నతులు ఇస్తామని మెలిక పెట్టడం సమంజసం కాదు. ఒకవేళ టెట్ తప్పనిసరి అయితే సంబంధిత సబ్జెక్టుల్లో పరీక్ష నిర్వహించి పదోన్నతులు ఇవ్వాలి. మొదట పదోన్నతులు ఇచ్చి ఆ తర్వాత టెట్ ఉత్తీర్ణత సాధించడానికి గడువు ఇవ్వాలి. దాంతోపాటు వయోభారం రీత్యా 50 ఏండ్లు పైబడిన వారికి ఎలాంటి పరీక్షలు నిర్వహించకుండా పదోన్నతులు ఇవ్వాలి. అదేవిధంగా టెట్ లేకుండానే డీఎస్సీ నిర్వహించి నిరుద్యోగ ఛాత్రోపాధ్యాయులకు న్యాయం చేయాలి.

- డాక్టర్ ఎస్.విజయ భాస్కర్
92908 26988

ఆటో రెన్యువల్ చేయాలి

డిగ్రీ కళాశాలల్లో పని చేస్తున్న లెక్చరర్లలో 60-70 శాతం మంది గెస్ట్ ఫ్యాకల్టీయే. డిగ్రీ కళాశాలల్లో ప్రస్తుతం రెగ్యులర్ టీచింగ్ స్టాఫ్ 1,400 మంది మాత్రమే ఉన్నారు. కాంట్రాక్టు లెక్చరర్లు 500 మంది కాగా, గెస్ట్ లెక్చరర్లు 1,600 మంది ఉన్నారు. కాంట్రాక్టు పద్ధతిలో ఎప్పటి నుంచో పని చేస్తున్నవారిని గత ప్రభుత్వం రెగ్యులర్ చేసింది. కానీ, గెస్ట్ ఫ్యాకల్టీగా పదేండ్లుగా పనిచేస్తున్నవారు అర్హతలు ఉన్నప్పటికీ అందుకు నోచుకోలేదు. అన్ని అర్హతలున్న వారిని కనీసం కాంట్రాక్టు పద్ధతిలోకి కూడా మార్చడం లేదు. ఒకే రాష్ట్రంలో ఒకే వ్యవస్థలో పని చేస్తున్న లెక్చరర్లను వేర్వేరుగా చూడటం ఎంతవరకు న్యాయం. కన్సాలిడేటెడ్, ఉద్యోగ భద్రత కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ తమ మ్యానిఫెస్టోలో ప్రకటించింది. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు 1,600 మంది అతిథి అధ్యాపకులను ఆటో రెన్యువల్ చేయాలి. పీరియడ్ విధానాన్ని రద్దు చేసి నెలకు రూ.50 వేల ఏకీకృత వేతనాలు చెల్లించి న్యాయం చేయాలి.

డాక్టర్ కొర్ర ఈశ్వర్‌లాల్
9491111983

ఎన్నికల వేళ విపక్ష నేతల అరెస్టులా?

డాక్టర్ కోలాహలం రామ్‌కిశోర్
98493 28496

ఢిల్లీ ముఖ్యమంత్రిగా కేజ్రీవాల్ ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుంచి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి ఆయన పక్కలో బల్లెంలా మారారు. అప్పటి నుంచి అవకాశం కోసం కాచుకొని కూర్చున్న మోదీ ప్రభుత్వం ఆయన్ను అరెస్టు చేసే దాకా నిద్రపోలేదు. ఇటీవల ఓ కేసులో ఝార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ అరెస్టు కాగా.. తాజాగా మరో సీఎం కేజ్రీవాల్ అరెస్టు కావడం దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. అవినీతికి వ్యతిరేకంగా అన్నాహజారే నాయకత్వంలో జరిగిన పోరాటంలో చురుకైన పాత్ర పోషించిన కేజ్రీవాల్.. చివరికి అవినీతి కేసులోనే అరెస్టు కావటం శోచనీయం. ఇది నిజంగా కేజ్రీవాల్ స్వయంకృత అపరాధమా? లేక బీజేపీ కుట్రలో భాగమా? అనేది భవిష్యత్తులోనే తేలుతుంది.

కేజ్రీవాల్ స్థాపించిన ఆప్ ప్రస్థానం మొదటి నుంచీ సంచలనమే. ఢిల్లీలో రికార్డు స్థాయిలో మూడుసార్లు గెలిచి బీజేపీ, కాంగ్రెస్‌లకు కొరకరాని కొయ్యగా తయారైన ఆ పార్టీ క్రమంగా ఇతర రాష్ట్రాలకు వ్యాపించి తన బలాన్ని చాటుకుంటున్నది. 2013లో ఢిల్లీలో తొలిసారి అధికారంలోకి వచ్చిన కేజ్రీవాల్ సర్కార్ అప్పటి యూపీఏ ప్రభుత్వం వల్ల ఇబ్బందులు పడింది. ఎన్డీయే అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితులు చక్కబడకపోగా కష్టాలు ఇంకా ఎక్కువయ్యాయి. కేజ్రీవాల్ సర్కార్ నిర్ణయాలను ఏదో ఒక వంకతో ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్లు అడ్డుకోవడం పరిపాటిగా మారింది. ప్రాంతీయ పార్టీగా మొదలైన ఆప్ జాతీయ పార్టీగా రూపాంతరం చెంది బీజేపీ, కాంగ్రెస్‌లకు ప్రత్యామ్నాయంగా మారుతుండటంతోనే కమలం సర్కార్ ఇలా చేస్తున్నదనే వాదనలు ఉన్నాయి.

మొదటి నుంచి విపక్ష నేతలను అరెస్టులతో భయపెడుతున్న బీజేపీ.. పార్లమెంట్ ఎన్నికల వేళ కేజ్రీవాల్‌పైనా అదే అస్త్రాన్ని ప్రయోగించింది. ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని చూస్తున్న ఆ పార్టీ కాంగ్రెస్ ఖాతాలను ఇప్పటికే స్తంభింపజేసింది. ఢిల్లీతో పాటు హర్యానా, పంజాబ్, గుజరాత్, గోవా తదితర రాష్ట్రాల్లో కీలకపాత్ర పోషించనున్న కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం ద్వారా ఇండియా కూటమిని దెబ్బకొట్టాలనేది బీజేపీ వ్యూహం. దాని వల్ల విపక్షాల విజయావకాశాలు దెబ్బతింటాయి.

దర్యాప్తు సంస్థలను భ్రష్టుపట్టించిన బీజేపీ సర్కార్.. తన రాజకీయ ప్రయోజనాల కోసం వాటిని విపరీతంగా వాడుకుంటున్నది. అందుకు తాజా ఉదాహరణ లిక్కర్ కేసు. ఈ కేసులో ఇప్పటికే ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా, ఆప్ ఎంపీ సంజయ్‌సింగ్ జైల్లో మగ్గుతున్నారు. ఇటీవల బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను ఈడీ అరెస్ట్ చేసింది. కస్టడీ పేరిట కాలయాపన చేస్తున్న ఈడీ.. కవిత బంధువులు, మిత్రులను విచారించినప్పటికీ ఎటువంటి ఆధారాలను సేకరించలేకపోయింది. ఇంతవరకు వారి వద్ద నుంచి నయాపైసా కూడా రాబట్టలేదు. ఈ కేసు నిందితుల్లో ఒకరైన ప్రముఖ వ్యాపారవేత్తను ఈడీ అధికారులు బెదిరించి అప్రూవర్‌గా మార్చినట్టు ఆరోపణలు వస్తున్నాయి. అతను అప్రూవర్‌గా మారేముందు ఎన్నికల బాండ్ల ద్వారా బీజేపికి భారీగా నిధులను సమకూర్చారు. ఈ విషయం ఎస్‌బీఐ వెల్లడించిన ఎలక్టోరల్ బాండ్ల వివరాల ద్వారా స్పష్టమైంది. అందుకే ఆయనకు బెయిల్ లభించినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈ బెయిల్ అప్లికేషన్‌పై ఈడీ అభ్యంతరం కూడా చెప్పకపోవడం అనుమానాలకు తావిస్తున్నది. అందుకే ఈ వ్యవహారం క్విడ్ ప్రోకో కిందికే వస్తుందని విపక్షాలు ఎప్పటి నుంచో ఆరోపిస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో జరిగిన ఈ అరెస్టుల వెనుక రాజకీయ ప్రయోజనాలు ఉన్నాయనే అనుమానాలు బలపడుతున్నాయి.



కొత్తగా ఏం చెప్తారు!

లిక్కర్ కేసులో సమాధానం చెప్పేందుకు ఈడీకి మూడు వారాల సమయం ఎందుకు? అరెస్టు సమయంలో ఏం చెప్పారో.. మూడు వారాల తర్వాత కూడా అదే చెప్తారు. నిందితులను ఒక్క రోజు జైలులో పెట్టడం కూడా వారి హక్కులను హరించడం కిందికే వస్తుంది.

- అభిషేక్ సింఘ్వీ, సీనియర్ న్యాయవాది

ఇటీవల కాలంలో మతపరమైన అసహన సంస్కృతి పెరుగుతున్నది. దీనికి అనుగుణంగా సోషల్ మీడియానీ, ఇతర సాధనాలనూ ఒక ప్రణాళిక ప్రకారం కొన్ని మతోన్మాద శక్తులు దుర్వినియోగం చేస్తున్నాయి. స్త్రీల పట్ల అశ్లీలమైన, అసభ్యకరమైన భాషను వాడుతున్నాయి. మరీ ముఖ్యంగా ప్రగతిశీల మహిళా మేధావులు, రచయిత్రులు, జర్నలిస్టులు, యాక్టివిస్టులు, కళాకారులను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియా వేదికగా దాడులకు తెగబడుతున్నాయి. అక్కడితో ఆగకుండా ఫోన్లలో బెదిరింపులకు కూడా దిగుతున్నాయి. ఈ శక్తులు ఉపయోగించే పద్ధతులు, వాడే భాష వాటి నేపథ్యాన్ని, మేధాస్థాయిని, నేర ప్రవృత్తిని వెల్లడిస్తున్నాయి.

మతోన్మాద శక్తులను కట్టడి చేయాలి!

తమ ఆలోచనలతో ఏకీభవించకుండా,భిన్నమైన ఆలోచనలు కలిగినవారి నోళ్లు మూయించే అనాగరిక, అమానుష చర్యలకు మతోన్మాద శక్తులు పాల్పడుతున్నాయి. సహజంగానే ఈ రకమైన దాడి ప్రధానంగా స్త్రీల మీదనే ఎక్కువగా జరుగుతున్నది. వీరి దృష్టిలో స్త్రీలు వంటింటి కుందేళ్లుగానే జీవించాలి. స్త్రీలు దేశంలో ఏర్పడుతున్న మత, రాజకీయ పరిణామాల గురించి ఆలోచించడం, తమ భావాలను వ్యక్త పరచడం ఈ అప్రజాస్వామిక, సంప్రదాయవాద సమర్థక ముఠాలకు నచ్చదు. స్త్రీలు తమ ఇష్టాలకు అనుగుణంగా కట్టు, బొట్టు, వేష, భాష ధారణలు చేసినప్పుడల్లా ఈ అరాచకులు రంగంలోకి దిగి, వ్యక్తిగతంగా కాల్ చేసి, తలుచుకుంటే వారి ఇళ్లపై దాడులు చేయగలమని, ప్రాణ హాని తలపెట్టగలమని బెదిరింపులకు పూనుకుంటున్నారు. చర్చ కు, భిన్నాభిప్రాయాలకూ తావులేకుండా చేసి, తమ విషపూరిత ద్వేష భావాలను విస్తృతంగా ప్రచారం చెయ్యడమే వీరి ఆశయం. ఈ అప్రజాస్వామిక, ప్రజావ్య తిరేక ధోరణులను మేము నిర్ద్వంద్వంగా ఖండిస్తున్నాం.

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 (1) (ఏ) ఈ దేశ పౌరులందరికీ వాక్‌స్వాతంత్ర్యాన్ని ఇచ్చింది. ఫలానా విధంగా అభిప్రాయాలు వ్యక్త పరచకూడదని, ఫలానా విధంగానే బతకాలని శాసించడం రాజ్యాంగ విరుద్ధం. ఈ ప్రాథమిక హక్కుని ప్రభుత్వంతో బాటు ఎవరూ హరించడానికి వీలు లేదు. ఈవిధంగా బెదిరింపులకు, దాడులకు పాల్పడే శక్తులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని, అలాంటి శక్తుల దూకుడుని కట్టడి చేయాల్సిందిగా ప్రభుత్వ వర్గాలను, పోలీసు వ్యవస్థను కోరుతున్నాం.

ప్రజాస్వామిక సంస్థలు, వేదికలు :

ప్రొ.జి.లక్ష్మణ్(పౌరహక్కుల సంఘం, తెలంగాణ), ఎస్.జీవన్ కుమార్ (మానవ హక్కుల వేదిక, తెలంగాణ,ఆంధ్ర రాష్ట్రాలు), అరసవిల్లి కృష్ణ , రివేరా (విప్లవ రచయితలసంఘం), శ్రీదేవి (చైతన్య మహిళా సంఘం), విజయ భండారు (హైదరాబాద్ విమెన్ రైటర్స్ ఫోరమ్), పసునూరి రవీందర్, కన్వీనర్ (సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరమ్), కె. శ్రీనివాసాచారి (హైదరాబాద్ హ్యూమనిస్ట్ మీట్), రేణుకా అయోల, తూముచర్ల రాజారాం (సంతకం సాహిత్య వేదిక), ఐకా బాలాజీ(మంచి సినిమా గ్రూపు), బి. గిరిజ (వాయిస్ ఫర్ జెండర్ జస్టిస్), కొండవీటి సత్యవతి (భూమిక), అమరేంద్ర దాసరి (సాహితీ వేదిక ఢిల్లీ), డా. బైరి నరేష్, జాతీయ అధ్యక్షుడు (మూఢనమ్మకాల నిర్మూలన సంఘం), మహిళా మరియు ట్రాన్స్‌జండర్ సంస్థల ఐక్య కార్యాచరణ వేదిక, ఖలీదా పర్వీన్, ఉష (సన్ని హిత), వి.సంధ్య (పీవోడబ్ల్యూ), సజయ, సుమిత్ర (అంకురం), వంగపల్లి పద్మ (వాయిస్ ఆఫ్ ద పీపుల్), కన్నెగంటి రవి(రైతు స్వరాజ్యవేదిక), గీతాంజలి(వెన్నెల సాహిత్య సామాజిక అధ్యయన వేదిక)

కవులు, రచయితలు, కార్యకర్తలు, విలేకరులు, న్యాయ వాద నిపుణులు:

అఫ్సర్, నారాయణ స్వామి, డా. సి. మృణాళిని, గోగు శ్యామల, విమల, ప్రసాదమూర్తి, అరణ్య కృష్ణ , వెంకటకృష్ణ, దొంతం చరణ్, నరేష్ సూఫీ,అరుణాంక్ లత, ఓల్గా, అక్కినేని కుటుంబరావు, పి .సత్యవతి, కొండేపూడి నిర్మల, ప్రతిమ, ఉదయమిత్ర, ఎ.కె ప్రభాకర్, నల్లూరి రుక్మిణి, తేళ్ళ అరుణ, అపర్ణ తోట, శివ లక్ష్మి, లక్ష్మీ సుహాసిని, కత్తి పద్మ, సీతా కంభంపాటి, శాంతి ప్రబోధ, అమరవాది నీరజ, గుత్తా జ్యోత్స్న, చల్లా సరోజినీ దేవి, బెల్లపు అనురాధ, చలం జీ.ఎస్, దుర్గా డింగరి, ఘంటసాల నిర్మల, పైడిమర్రి గిరిజ, జయలక్ష్మి, సమ్మెట ఉమాదేవి, మంజుల, రోహిణి వంజారి, రాజ్యలక్ష్మి, శ్రీదేవి, నాంపల్లి సుజాత, మ